త్రైలోక్యగీత
నవమాధ్యాయము
గుణ విచారయోగము

త్రైలోక్యా ఉవాచ:-

జ్ఞానినామగ్ర గణ్యస్త్వం, దత్త! బ్రూహి గుణానిమాన్ |
జగన్మూలాన్ జగన్నిష్ఠాన్, జగల్లీనాన్ జగన్మతాన్ ||9.1||

[కుమారి త్రైలోక్య అడిగింది:-
ఓ దత్త! ఆధ్యాత్మిక గురువులందరిలో అగ్రగామి తమరు! ఈ సృష్టికి మూలకారణాలైన స్వభావములేవి? సృష్టిలో ఉన్న స్వభావములేమిటి? లయకాలము నందు ఈ సృష్టితో పాటు విలీనమయ్యేవేవి? ఈ సమస్త సృష్టికి మూలపదార్థముగా భావింపబడునది ఏది?]

శ్రీ శ్రీ శ్రీ దత్తస్వామీ ఉవాచ:-

త్రైలోక్యే! మేధయా శ్రేష్ఠే! స్వోత్తరం చావ ధారయ |
ప్రోక్తాన్యేవ గుణ ద్రవ్యా-ణ్యత్ర, మిథ్యా స్వసత్తయా ||9.2||

[శ్రీశ్రీశ్రీ దత్తస్వామి ఈ విధంగా వచించారు:-

ఓ త్రైలోక్య! మేధావులలో నీవు శ్రేష్ఠమైన దానవు! ఏకాగ్రతతో **నేను** చెప్పేది వినుము. ఈ ప్రపంచంలో (సృష్టించబడినట్టిది) పదార్థము లేదా ద్రవ్య రూపంలో ఉన్నది అయినా లేక గుణము (సూక్ష్మ శక్తిరూపము) లేదా స్వభావము అని చెప్పబడినదైనా, ఈ రెండు విధములైన సృష్టి భాగములు సాపేక్ష సత్యములే కాని యథార్థముగా సత్యమైనవి కావు. ద్రవ్య గుణములలో, ద్రవ్యము స్థూలపదార్థముగా కనిపిస్తుంది, గుణము సూక్ష్మవిషయముగా

కనిపిస్తూ, ఇవి రెండు వేరు వేరు కోణాలలో కనబడుతూ వాటి మధ్య భేదం ఉన్నట్లు గమనించబడతాయి. కాని సాపేక్ష అంశములు మరియు సత్యమైన అంశములు అనే కోణములో చూసినట్లైతే ఈ రెండు అంశములు వేర్వేరు కావు, రెండూ ఒక్కటే అని తెలుస్తుంది].

గుణనైల్యోత్పల ద్రవ్య – భేద సూక్ష్మ ఘనస్థితిః |
సమా తు వ్యవహారార్థ – సత్తా సర్వా జగత్పరా ||9.3||

[ఉదాహరణకు కలువపువ్వు ద్రవ్యము, నీలివర్ణము దాని స్వభావము. కలువపువ్వు స్థూలమైన పదార్థము మరియు దాని నీలిరంగు అనేది ఒక సూక్ష్మశక్తి రూపమైన గుణము. ఈ రకమైన తేడా రెండింటి మధ్య ఉన్నప్పటికీ ఈ రెండు అంశములు సాపేక్ష సత్యములనే గుర్తింపు మాత్రం రెండింటికీ సమానముగా ఉన్నది. ఎందుచేత అంటే సృష్టించబడిన అంశములన్నీ సాపేక్ష సత్యములే. అయితే, సృష్టి భగవంతుడి దృష్ట్యా సాపేక్ష సత్యమే తప్ప జీవ దృష్ట్యా పరమార్ధ సత్యమే.]

సృష్టిమూలం పరబ్రహ్మ, పరమార్థ సదుచ్యతే |
అసత్పరం స్వయం కుండీ, సత్ పూర్వం సా మృదాదిమా ||9.4||

[ఈ సృష్టి మొత్తానికి మూలకారణమైనవాడు, సృష్టి కర్త లేదా అనూహ్య పరబ్రహ్మము కావున తానొక్కడే యథార్థమైన పరమార్థ సత్యము. కుండ పుట్టుకకు ముందే మట్టి అను మూలపదార్థము ఉన్నది కావున మట్టి యథార్థమైన పరమార్థ సత్యము. కుండ మట్టి నుండి ఉత్పన్నమైన రూపము కావున సాపేక్ష సత్యము. స్వాభావికముగా చూసినట్లైతే కుండ-అసత్యము, మట్టి-సత్యము. ఇదే విధముగా అనూహ్య పరబ్రహ్మము ఆది నుండి ఉన్నది కావున స్వాభావికముగా సత్యము. తర్వాత అనూహ్య పరమాత్మ చేత ఈ సృష్టి సృష్టించబడినది కావున అది స్వాభావికముగా అసత్యము.

కానీ, పరమాత్మ యొక్క పరమార్ధ సత్యము చేత ఈ సృష్టి పరమార్ధ సత్యముగా మారి ప్రకాశించుచున్నది.]

మృత్సత్తా మస దాదత్తే, సద్వినోదాత్ సమర్ధతః |
అతో ద్రవ్య గుణా మిథ్యా, జగత్సర్వం చ తత్తథా ||9.5||

[అసత్య కార్యమైన - కుండ తన మూలకారణమైన మట్టి నుండి పరమార్ధ సత్యమును (ఉండుటను) అప్పు తెచ్చుకుని సత్యము వలె కనపడుచున్నది. ఇదే విధముగా స్వాభావికముగా అసత్యమైన ఈ సృష్టి, స్వాభావికముగా యథార్ధసత్యమైన అనూహ్య పరమాత్మ నుండి పరమార్ధ సత్య విలువను అప్పుగా తెచ్చుకుని తాను యథార్ధ సత్యమైనట్టు కనిపిస్తుంది. సృష్టి సాపేక్ష సత్యమైనది, ఎందుకంటే అది స్వాభావికముగా (ద్వైవదృష్ట్యా) అసత్యము కాని యథార్ధసత్యమైన పరమాత్మ నుండి సత్యవిలువను అప్పుగా తెచ్చుకుని యథార్ధ సత్యమైనదిగా కనబడుతుంది. కావున గుణస్వభావములను (కుండ) సాపేక్ష సత్యమని మూలకారణ పదార్ధమును (మట్టి) యథార్ధమైన సత్యమని మనము పొరబడరాదు. ఎందుకంటే ఈ ఉదాహరణలో మట్టి, కుండ అను రెండు అంశములు యథార్ధసత్యమైన భగవంతునితో పోల్చినపుడు సాపేక్ష సత్యములే అవుతున్నాయి. అంటే యథార్ధసత్యమైన భగవంతునితో పోల్చినపుడు సాపేక్షముగా మాత్రమే సృష్టి సత్యము. అనూహ్య పరమాత్మ సర్వశక్తిమంతుడు. కావున తాను యథార్ధమైన వినోదము పొందుట కొరకు, (తన ఊహాలోకమైన సృష్టిని) స్వాభావికంగా అసత్యమైన సృష్టికి తన యథార్ధతను అప్పుగా ఇచ్చి సృష్టిని యథార్ధమైన సత్యముగా మార్చాడు. మనిషికి భగవంతుని వలె ఇంతటి శక్తి లేదు. కావున మనిషి, తన ఊహ ప్రపంచమునకు భగవంతుని వలె యథార్ధమైన సత్యవిలువను ఇచ్చి, తాను దానితో యథార్ధమైన వినోదమును పొందలేడు. అనూహ్య పరమాత్మ తన వినోదం కోసమే ప్రపంచమును సృష్టించాడని వేదము చెప్పిన విషయమును **ఏకాకీ న రమతే..** మనము గుర్తుంచుకోవాలి.]

జడశక్తిః పుర స్సృష్టా, యతో ద్రవ్య చిదాగతా |
సర్గే రజస్తమ స్సత్త్వం, చిద్గుణాః పర సంగమాత్ ||9.6||

[మొట్టమొదట అనూహ్య పరమాత్మ సాపేక్ష జడశక్తిని సృష్టించాడు. దాని నుండి క్రమక్రమంగా సాపేక్ష పదార్థము మరియు సాపేక్ష చైతన్యము సృష్టించబడినాయి. ఈ చైతన్యమే సత్త్వము. మూలజడశక్తిని రజస్సు అంటారు. ఘనీభవించిన పదార్థరూపమును తమస్సు అంటారు. ప్రాథమికముగా జడము కాని గుణములు (స్వభావములు) జడములు కాని చైతన్యము లేదా సత్త్వమునకు సంబంధించినవి. కాని మిగిలిన రెండు గుణములు రజస్సు మరియు తమస్సు, అను జడము కాని చైతన్యములు చేరి మలినపరచినందున అనేకములైన చెడు గుణములు ఫలిస్తున్నాయి. సత్త్వము ఎప్పుడునూ చైతన్య స్వరూపమే. రజస్సు, తమస్సులు చైతన్యముగానూ, జడముగానూ ఉండును. ఉదాహరణకు అహంకారము చైతన్యమైన రజో గుణము. జడశక్తి జడమైన రజో గుణము. అలసత్వ గుణము చైతన్యమైన తమో గుణము. పదార్థము జడమైన తమో గుణము.]

న హి దృష్ట స్త్వేక గుణః, సర్వదా మిశ్రమా ద్గుణే |
న మూల చిదచిద్భేదః, చిద్దత్తా తేన వా గుణః ||9.7||

[సత్త్వ రజస్తమో గుణములు అను మూడింటి నుండి ఏదైనా ఒక్క గుణము మాత్రమే ఎప్పటికీ లభించదు. ఏ సందర్భములోనైనా 100% సత్త్వము లేదా రజస్సు లేదా తమస్సు అని చెప్పబడితే దాని అర్థం, మూడు స్వభావాల నిష్పత్తిలో చెప్పబడిన ఆ ఒక్క గుణము అత్యధికభాగము కలిగి ఉండి మిగిలిన రెండు గుణములు బహు కొద్ది భాగమై ఉన్నాయని మాత్రమే తెలియాలి. సాపేక్షమైన ఐదు జడపదార్థముల నుండి సృష్టి ప్రారంభమైనది. ఈ సాపేక్ష సృష్టి క్రమము (**అన్నాత్ పురుషః ...**) నందు జీవాత్మ లేదా సాపేక్ష చైతన్యము చిట్టచివర సృష్టించబడిన అంశము అని వేదము చెప్పినది. సాపేక్ష జడత్వము (relative inertia) మరియు సాపేక్ష

చైతన్యముల (relative awareness) మధ్య ప్రాథమిక భేదమేమీ లేదు, ఎందుకంటే ఈ రెండు సాపేక్ష సత్యమైన సృష్టి అను కోవకు చెందినవి మాత్రమే. కావున నీవు సాపేక్ష సత్యము (relatively real) అయిన జీవాత్మను ఈ సృష్టికి యథార్థ మూలమని, కర్త (creator) అని అనలేవు. సృష్టిక్రమములో మూలకారణమైన అంశమునకు అదనముగా నూతనగుణములు కూర్చి మరి కొంత మెరుగైన ఫలితము సృష్టింపబడుతున్నదని నీవు తెలుసుకున్నావు. జడమైన శక్తి (మూలము- inert energy) నుండి జడము కాని చైతన్యము- (non- inert awareness) అను నూతన ఫలితము సృష్టించబడటము కేవలం భగవంతుని సంకల్పము కారణముగా జరుగుతున్న ప్రక్రియ అని నీవు తెలుసుకోగలవు కాని ఈ (జీవాత్మ)ను నీవు ఆదిలో ఉన్నట్టి సృష్టికర్త అనలేవు.]

గుణాశ్చేదేవ పరయోః, ప్రభావాన్నామ భిద్యతే |
అచిత్పరౌ రజోమూలం, సర్గ మూలా స్తృయోగుణాః ||9.8||

[చైతన్యము ఆధారముగా గల జ్ఞానమే 'సత్త్వము'. కాబట్టి చైతన్యమునే సత్త్వము అనవచ్చును. రజస్సు అనేది కణ స్వభావము గల జడశక్తి. రజస్సు అంటే అతి చిన్న పరమాణువులు గల ధూళి. తమస్సు అంటే జడపదార్థముగా మారగల ఘనీభవించిన జడత్వము. జడశక్తి, జడపదార్థము మరియు జడము కాని చైతన్యము అనేవి ఈ సమస్త సృష్టిని ఏర్పరచిన మూడు ప్రాథమిక పదార్థాలు, సృష్టి-వరుసక్రమంలో వీటిని పేర్కొంటే అవి రజస్సు, తమస్సు మరియు సత్త్వము. జడము కాని చైతన్య స్వభావములన్నీ సత్త్వమునకు సంబంధించినవి, కాని అవి రజస్సు చేత, తమస్సు చేత స్వల్పంగా కాని, అధికంగా కాని ప్రభావితమౌతాయి. స్వల్పప్రభావము పొందిన జడము కాని సత్త్వ స్వభావమును 'సాత్త్విక స్వభావము' అంటారు. అధికప్రభావముకు లోనైన జడము కాని స్వభావములను రాజసిక స్వభావము లేదా తామసిక స్వభావము అంటారు. ఈ మూడు రకముల జడము కాని స్వభావములలో సత్త్వమే ప్రాథమిక పదార్థము అవుతున్నది.

కావున రాజసిక స్వభావము లేదా తామసిక స్వభావములను వివరిస్తూ, రజస్సు మరియు తమస్సు కారణంగా ఏర్పడినవి కావున జడమైన స్వభావములు అని అనరాదు. జడము కాని సత్త్వ స్వభావముల కంటే రజస్సు మరియు తమస్సుల ప్రభావము ఎక్కువగా ఉందని మాత్రమే మనము ఇక్కడ తెలుసుకోవాలి.]

ఆధారాధేయ సంబంధౌ, ద్రవ్య ధర్మౌ జగత్యపి |
ఆధారో జగదాధేయః, స నోహ్యో నిర్గుణ స్తతః ||9.9||

[ద్రవ్యము లేదా సాకారమైన ఆధారము అనేది గుణము లేదా సూక్ష్మ స్వభావమునకు మూలమైనది, ఉదాహరణకు స్థూలరూపమైన కలువ పువ్వు ద్రవ్యము అయితే దాని యొక్క సూక్ష్మ నీలిరంగు గుణము అవుతుంది. స్వతంత్ర ఆధారమైన ద్రవ్యమునకు అస్వతంత్ర గుణముతో గల సంబంధము ఈ సృష్టిలో కనిపించును. కాని ఈ సమస్త సృష్టి కేవలము అస్వతంత్రమైన స్వభావము లేదా గుణము అయి ఉండి దానికి ఆధారభూతముగా స్వతంత్ర ద్రవ్యమైన అనూహ్య భగవానుడు ఉన్నాడు. కావున అనూహ్య పరమాత్మ - ద్రవ్యము మరియు సృష్టి - గుణము. అంటే సృష్టి ఏర్పడక ముందు అనూహ్య పరమాత్మ నిర్గుణము లేదా ఏ స్వభావము లేని వాడు. ఇక్కడ గుణము అంటే ఈ సమస్త సృష్టి అని అర్థము, అంతే కాని సృష్టిలో కనిపించే కలువ పువ్వు, దాని నీలిరంగు అనే ఆధారిత గుణము లేదా అస్వతంత్ర స్వభావములు మొదలైనవి కావు.]

స గుణో జగతా నోహ్యః, సత్త్వ ధర్మైశ్చ స ప్రభుః |
నోహ్య చిత్తు సర్వశక్తేః, భ్రాంతా జీవ చిదాత్మగాః ||9.10||

[ఈ విశ్లేషణను ఆధారముగా చేసుకుని 'సగుణ' అంటే సృష్టిలోని సృష్టించబడిన గుణముతోనైనా (ఏ భాగమైనా) విలీనము చెందిన అనూహ్య పరబ్రహ్మము అని అర్థము. సగుణమును ఇలా కూడా వివరించవచ్చును - జడము కాని చైతన్యముతో లేదా సత్త్వముతో భగవంతుడు యోగము

చెందటము, కారణమేమంటే భగవంతుడైన మొట్టమొదటి తేజోరూపములో నున్న దత్తభగవానుడు అవతరించ గల శరీరమాధ్యమములో రాజసిక, తామసిక గుణములు (చైతన్య స్వభావములు) ఉండవు. 'గుణము' అనే శబ్దమును నీవు శ్రద్ధతో పరిశీలించి సాత్త్విక స్వభావము అన్నట్లైతే, అది సాత్త్విక స్వభావము కలిగిన వాడు అని అర్థము. దీనికి ఇద్దరే అర్హులు (నిజానికి ఒక్కరే), ఒకటి మూలమైన అనూహ్య పరమాత్మ, రెండు తేజోరూపాత్మకుడైన దత్త భగవానుడు. అలాకాక నీవు 'గుణము' సృష్టి అనే దృష్టికోణంలో చూసినట్లైతే 'నిర్గుణ' అంటే యథార్థమైన అనూహ్య పరబ్రహ్మము, సృష్టికి పూర్వము ఉన్న వాడు. మూలకారణుడైన ఈ అనూహ్య పరమాత్మ సృష్టిచేయుటకు సంకల్పించినాడు. ఇక్కడ నీకొక సందేహము కలగవచ్చును, సంకల్పమునకు మూలకారణమైన చైతన్యము ఇంకా లేదు కదా అనే సందేహము. అనూహ్య పరమాత్మ లో చైతన్యము ఎలా ఉన్నది? నిజానికి సృష్టించిన క్రమంలో కదా చైతన్యము ఉద్భవించినది! అని. దీనికి సమాధానము, సృష్టికి పూర్వము ఉన్న అనూహ్య పరమాత్మ యొక్క చైతన్యము మరియు సృష్టి క్రమములో ఉద్భవించినట్టి 'ఊహించదగినట్టి సాపేక్ష సత్యమైన చైతన్యము' ఒక్కటి కాదు. ఈ పరమార్థ చైతన్యము ఊహలకు సైతం అందనిది. ఇది జడమైన **శక్తి** లేకుండా, **పదార్థ**స్వరూపమైన నాడీవ్యవస్థ లేకుండా సరళంగా ఆలోచించగల చైతన్యము. ఇది అనూహ్యమైన చైతన్యము, సాపేక్షమైన ఊహించదగిన చైతన్యము కాదు. ఎందుకనగా, అనూహ్య చైతన్యము అంటే సర్వశక్తికేంద్రము అయిన అనూహ్య పరమాత్మ చేత సరళముగా ఆలోచించుశక్తియే కాని నాడీవ్యవస్థ లో జడమైన శక్తి రూపాంతరము చెందడం ద్వారా ఉద్భవించిన చైతన్యము కాదు. ముగ్గురు ఆధ్యాత్మిక ఆచార్యుల ప్రబోధనలలో పలుకబడిన 'చైతన్యము' అను శబ్దము కచ్చితంగా అనూహ్య పరమాత్మ యొక్క సరళచైతన్యమును సూచించేదే అయినప్పటికీ జనులందరూ దీనిని సాపేక్షమైన, మరియు ఊహించదగిన చైతన్యము లేదా జీవాత్మ అని, పరమాత్మ

చేసిన సృష్టిక్రమములో చివరిదైన చైతన్యమని (జీవుడని) అపోహ పడ్డారు. ఈ పొరపాటైన భావన అనూహ్య పరమాత్మకు మరియు ఊహించదగిన సాపేక్ష చైతన్యము లేదా జీవాత్మకు మధ్య అంతర్లీనమైన సంబంధము ఉన్నట్లు భ్రమింపజేసినది. అయితే చైతన్యము 'పనిచేయు విధానము' సమానము. అంటే అనూహ్య పరమాత్మ సరళ చైతన్యము కూడా జీవాత్మల యొక్క చైతన్యము వలె విషయవస్తువుల పరిజ్ఞానమును కలిగి ఉంటుంది. 'పనిచేయు విధానము' అంటే అర్థము జీవాత్మ శరీరంలో, మేధస్సు - నాడీవ్యవస్థ మధ్య జరిగే జడశక్తి రూపాంతరము కారణంగా ఉత్పన్నమైన విశేషపరిణామముతో విషయములు తెలియగల చైతన్యము కాదు. అనూహ్య పరమాత్మ యొక్క సరళ చైతన్యము, తను సర్వశక్తిమంతుడైన అనూహ్య తత్త్వము అయిన కారణంగా ఉద్భవించినది. నిజానికి అనూహ్య సరళ చైతన్యమూ, అనూహ్య పరబ్రహ్మమూ ఒక్కటే. (ఎన్ని అనూహ్యములైనా ఒక్క అనూహ్యమే కదా).

ముగింపు,-

1. అనూహ్య భగవంతుడు లేదా పరబ్రహ్మ తన సర్వశక్తి చేత, అనూహ్యమైన సామర్థ్యము చేత దేని నైనా సృష్టించగలడు (అనూహ్య పదార్థములు అనబడేవి). ఈ సృష్టించబడిన పదార్థము వేదములు చెప్పినట్లు పంచభూతముల సృష్టి క్రమమును అనుసరించక పోవచ్చును. ఉదాహరణకు సృష్టిక్రమము కంటే ముందే చైతన్యము (వినోదము కొరకు సృష్టించ వలెనని సంకల్పము) సృష్టించబడినది. ఈ చైతన్యము, ఊహించుటకు వీలుకానట్టి చైతన్యము. దీనికన్నా, అనూహ్య పరబ్రహ్మమే ఆ అనూహ్య చైతన్యము అనుకొనుట ఉత్తమము.

1. అనూహ్య పరబ్రహ్మము సృష్టించాలనే సంకల్పము లేకముందు అనూహ్యమైన చైతన్యము కూడా లేదు. ఆ

కారణంగా అనూహ్య పరబ్రహ్మము, రెండవ అంశం ఏదీ లేకుండా ఒక్కడే ఉన్నాడు. ఈ స్థితిలో అనూహ్య పరబ్రహ్మమును 'నిర్గుణము' అనవచ్చును. అంటే **తను** తప్ప **తన** చేత రెండవ వస్తువేదీ సృష్టించబడని స్థితిలో ఉన్న అనూహ్య పరబ్రహ్మము.

2. అనూహ్య పరబ్రహ్మము ఎప్పుడైతే ఆలోచించుట ఆరంభించాడో (అనూహ్య చైతన్యము), అప్పుడే తన మొదటి సృష్టి అంశం (అనూహ్య చైతన్యము) తనతో చేరింది. ఇప్పుడతను 'సగుణము' అయ్యాడు. అనూహ్య చైతన్యమే అనూహ్య పరబ్రహ్మము కావున, అతడు 'నిర్గుణము' కూడా అనబడవచ్చును!
3. అనూహ్య పరబ్రహ్మము ఎప్పుడైతే మొదటి తేజోరూపమును సృష్టించి తాను అందులో విలీనమై దత్త భగవానుడైనాడో ఆ మొదటి అవతారమైన అనూహ్య పరబ్రహ్మ లేదా దత్త భగవానుడు కూడా 'సగుణ'మే అగును. అనగా తాను సృష్టించిన మొదటి శరీరమాధ్యమము లోని అనూహ్య పరబ్రహ్మము. ఈ దత్తుడు మాత్రము సగుణమే అని ఎల్లప్పుడు పిలువబడాలి (సృష్టించబడిన శరీరంతో ఉన్నాడు కావున).
4. సగుణ అంటే కేవలం సృష్టితోపాటు గల భగవంతుడు అని మాత్రమే కాదు, చైతన్యము యొక్క గుణములు, అనగా సత్త్వము తో చేరిన భగవంతుడు (విష్ణు తత్త్వము). మరే ఇతర గుణములు భగవంతుని చేరినప్పటికీ, సత్త్వము యొక్క ఇతర స్వభావములు కానీ, అనగా చైతన్యమును ప్రభావితము చేసిన ఇతర గుణములు అయిన రజస్సు (బ్రహ్మ తత్త్వము) గాని లేదా తమస్సు (శివ తత్త్వము) గాని లేదా రెండు గుణములు గాని కలిసిన స్థితి కూడా ఉండవచ్చును. ఈ త్రిమూర్తిత్వము పరబ్రహ్మములో అనూహ్య చైతన్యము వలె ఏకత్వరూపంగా ఉన్నది అన్ననూ తప్పు లేదు.

5. దత్త భగవానుడు సృష్టించాలనే తలంపు లేనపుడు 'నిర్గుణము' అనబడతారు. సృష్టికార్యము మొదలిడినప్పటి నుండి తానే సగుణము అనబడతారు.]

మిథ్యాయాం పరమార్థస్య, విభూతిర్న సమే క్వచిత్ |
తద్విభూతిక్షణాల్లోకే, మిథ్యేదం సత్యసత్తు తత్ || 9.11||

[అనూహ్య పరబ్రహ్మము సృష్టించిన సృష్టి సాపేక్ష సత్యమైనదై, తాను స్వయంగా యథార్థమైన సత్యము కావలెను. ఎందుచేతనంటే ఒక యథార్థసత్యమైన అంశము మరొక యథార్థసత్యములో ఎలాంటి మహిమలను (శూన్యము నుండి సృష్టి, ఒక వస్తువును మరొక రూపంలోకి మార్చగలుగుట, సృష్టిని లయము చేయుట) చేయలేదు. ఒక యథార్థసత్యము రెండవ సాపేక్ష సత్యములో మహిమలను చేయగలదు. మనం ఈ విశ్వములో ఎన్నో అద్భుతమైన మహిమలను చూస్తున్నాము. ఉదాహరణకు నీరు, పెట్రోలు అన్ని సమాన సత్యములు కాబట్టి నీవు నీటిని పెట్రోలుగా మార్చలేవు. కాని నీవు నీ ఊహాప్రపంచంలో నీటిని పెట్రోలుగా మార్చగలవు. నీ ఊహా ప్రపంచంలో, ఊహాప్రపంచపు సత్యవిలువ కంటే నీవు అధికమైన సత్యవిలువను కలిగి ఉన్నావు కాబట్టి నీవు ఈ ప్రక్రియను చేయగలవు.]

చిద్గుణా స్త్రివిధా స్తత్తత్, గుణప్రాధాన్య భాసితాః |
ఏకైకో ద్విముఖ స్సాధు, రసాధుర్వా ముఖాశ్రితః ||9.12||

['గుణము' అనే పదమునకు మనము జడము కాని గుణములు అయిన చైతన్యముగా భావిస్తే, ఈ గుణములను మూడు విధాలుగా విభజింపవచ్చును. 1. సత్త్వ గుణములు, సత్త్వము ఎక్కువగా ఉండి మిగిలిన రెండు గుణములైన రజస్సు, తమస్సు స్వల్పంగా ప్రభావము చూపేది. దీనికి ఉదాహరణ,- ఆధ్యాత్మిక జ్ఞానము. 2. రాజసిక గుణములు, ప్రబలమైన రజస్సు చేత ప్రభావితము అయిన సత్త్వము (చైతన్యము) యొక్క జడము కాని గుణములు

లేదా చైతన్యము. ఉదాహరణ,- లోభత్వము. 3. తామసిక గుణములు, ప్రబలమైన తమస్సు చేత ప్రభావితమైన సత్త్వము (చైతన్యము) యొక్క జడము కాని గుణములు లేదా చైతన్య భావములు. ఉదాహరణ,- కామోద్రేకము. ఈ మూడు రకములలో ప్రతి ఒక గుణము మంచికోణములో గాని చెడ్డకోణములో కాని ముందుకు సాగుతుంది]

సదసన్ముఖమాశ్రిత్య, సదసద్గుణ ఉచ్యతే|
ఇదం సామాన్య మఖిలే, గుణసంగే హి తత్కృతే ||9.13||

[జనులు ఆరుగుణములను, రాజసికములు మరియు తామసికములు అయినందున అవి చెడ్డవని, జీవాత్మకు శత్రువులు (అరిషడ్వర్గము) అని అంటారు. ఈ ఆరింటిలో ప్రతి ఒక్కటి పూర్తిగా చెడ్డదని అంటారు. ఈ వివేచన సరైనది కాదు. ఆరింటిలో ప్రతి ఒక్క గుణమునకు కూడా మంచి మరియు చెడు అను రెండు కోణములున్నవి. ఏ గుణమైనా మంచికోణములో చూడబడితే అది మంచి గుణము. అదే గుణము చెడుకోణములో చూస్తే అది చెడుగుణము. అరిషడ్వర్గము ఒక్కటే కాదు భగవంతుడు సృష్టించిన ఏ గుణమైనా ఈ ప్రపంచములో ఇదే నియమమును అనుసరిస్తున్నది.]

కామక్రోధ లోభమోహ - మద మాత్సర్య సద్గుణే |
ఏకైకో ద్విముఖో గ్రాహ్యో, వివేకేన సమే తథా ||9.14||

[రజస్సు మరియు తమస్సులు కలుగచేయ గల ఆరు దుర్గుణములు వరుసగా కామము, క్రోధము, లోభము, మోహము, అహంకారము మరియు మాత్సర్యము. ఈ ఆరు గుణములలో ప్రతి ఒక్క గుణమునకు నాణెమునకు వలె రెండేసి ముఖములు ఉంటాయి, ఒకముఖము మంచిదైతే రెండవది చెడ్డముఖము. ఆ గుణము మంచి చెడులలో ఏ ముఖంగా కొనసాగిందో గమనించి ఆ

గుణము మంచిది లేదా చెడ్డది అంటారు. ఏదేని గుణము యొక్క మంచి, చెడు ముఖాలను గుర్తించే జ్ఞానము ఇలా చెప్పబడినది.,-

1. కామము - నైతికము (భార్యాభర్తలు) అయితే మంచిది, అనైతికము (అన్యులు) అయితే చెడ్డది.
2. కోపము - చెడ్డ వారిపై చూపితే మంచిది, మంచి వారిపై చూపితే చెడ్డది.
3. లోభము - అర్హత లేని వారి పట్ల చూపితే మంచిది, అర్హులైన వారికి ఇవ్వకపోతే చెడ్డది.
4. మోహము - భగవంతుని పట్ల ఉంటే మంచిది, ప్రపంచము పట్ల ఉంటే చెడ్డది.
5. అహంకారము - తక్కువ మోతాదులో మంచిది. ఆత్మ విశ్వాసం కలిగి ఉండేటంత, మరియు నేను అనే ప్రాథమిక గుర్తింపు కలిగి ఉండేటంత మోతాదులో మంచిది. ఎక్కువ మోతాదుకు పెరిగి గర్వము స్థాయికి చేరితే చెడ్డది.
6. అసూయ - ఇతరులను చూచి అసూయపడి తన వృద్ధిని సాధించుట అనే కోణములో మంచిది. అదే అసూయ ఇతరులకు బాధ కలిగించగల మోతాదుకు పెరిగితే ఈ రెండో కోణములో చెడ్డది.

ఈ విధంగా ప్రతి గుణము ఈ ప్రపంచములో వాని అంచనాలను బట్టి మంచి చెడు అను రెండు ముఖములు కలిగి ఉన్నాయి.]

దుర్గుణాత్ పాప బాధా హి, తద్దుష్ట దైవ నిర్మితాత్ |
ఇత్యుక్తిర్వితథా సాధుః, సర్వో వక్త్రేణ తత్కృతః ||9.15||

[కొందరు భగవంతుడు చెడుగుణాలను సృష్టించాడని నిందిస్తారు. వాటి ప్రభావము చేత జనులు పాపములు చేసి శిక్షల బారిన పడుతున్నారని, భగవంతుడు ఇదంతా ఆనందంగా శాడిస్టులాగా చూస్తున్నాడని అంటారు. కాని ఈ చర్చ అర్థము లేనిది.

ఎందుకంటే ఏ గుణము కూడా పూర్తి మంచిది లేదా పూర్తి చెడ్డది కాదు. గుణము అంచనా మంచిదైతే ఆ గుణము మంచిది, ఒకవేళ అదే గుణమును చెడుగా అంచనా వేస్తే , అదే గుణము చెడ్డదవుతుంది. ఈ ప్రపంచంలో భగవంతుడు సృష్టించిన అన్ని గుణములు, సృష్టించిన సమయములో మంచికోణములో మాత్రమే అంచనా వేయబడినవి కావున అన్ని గుణములు మంచివే.]

సదసన్ముఖత స్సర్వే, సద్వా ఽసద్వా సమంతతః |
సదసత్ సచ్చ ముఖతః, జీవేన వ్యత్యయః కృతః ||9.16||

[జీవులు ప్రతి గుణమును చెడుకోణములోకి తిప్పి ఆయా గుణములను చెడ్డవిగా గుర్తింపు తెచ్చారు. అలాగే కొన్ని గుణములను మంచి కోణములలో పొడగించి వాటిని పూర్తిగా మంచి గుణములని ముద్ర వేశారు. నిజం ఏమిటంటే ఏ మంచి గుణము అయినా చెడు కోణములోకి పొడగించిన అది చెడ్డగుణముగా మారుతుంది. మరియు ఏ చెడుగుణము అయినా దానిని మంచి కోణములోకి పొడగిస్తే అది మంచి గుణము అవుతుంది. జీవాత్మలు పొరపాటుగా శాశ్వత ప్రాతిపదికన కొన్ని గుణములు మాత్రమే మంచివి, కొన్ని చెడ్డవి అని అర్థము చేసుకున్నారు. నిజానికి భగవంతుడు అన్ని గుణములను మంచివి గానే సృష్టించినాడు, ఎందుకంటే భగవంతుడు చెడును ఎప్పటికీ సృష్టించడు.]

భీష్మ ద్రోణ దయా పాపం, పుణ్యాయ కృష్ణ వంచనా |
మతాంతరేప్యఽగ్ని గర్తః, దయా క్రోధౌ ప్రభోర్మతౌ ||9.17||

[దయ మంచి గుణము, కాని దానిని చెడ్డ వారిపై చూపిస్తే అది చెడుగుణమై నిన్ను శిక్షకు గురి చేస్తుంది. భీష్మ, ద్రోణులు కౌరవుల పక్షము వహించారు కావున యుద్ధములో శ్రీకృష్ణుని చేతిలో ఘోరముగా శిక్షింపబడినారు. మోసము ఒక చెడ్డ గుణము, కాని ఒకవేళ అది నీవు మోసగాళ్ళపై చూపితే మంచి గుణము. మంచివారైన పాండవులను జూదములో పాచికలను ఉపయోగించి

మోసము చేసిన కౌరవులను శ్రీకృష్ణుడు యుద్ధములో మోసము చేశాడు. కొన్ని మతాలు అందరిపైన దయ, కృప చూపడమే భగవంతుని దివ్య మార్గము అని బోధిస్తున్నాయి. ఇది సరైనది కాదు ఎందుకంటే అవే మతాలు, చెడ్డవారు నరకములో మండుతున్న అగ్నిలోకి విసిరివేయబడి ఘోరంగా శిక్షింపబడతారు అని కూడా బోధిస్తున్నాయి, మరి ఇది దయ, కృప కాదు కదా! కాబట్టి దయ, క్రోధము అను రెండు గుణములు కూడా భగవంతుని దివ్య గుణములే, ఎందుకంటే దయను భగవంతుడు మంచివారిపైన, క్రోధాన్ని చెడ్డవారిపైన చూపుటకు నిర్దేశించినాడు.]

అవతారస్య కారుణ్యం, సంస్కారాయా ఒఘవత్యపి |
అన్యథా నరకే దండః, న విరోధ స్సమన్వయాత్ ||9.18||

[పాపులపై దయ కలిగి ఉండాలని బోధించే మతాలు, ఈ విశేషమైన అంశమును గమనించాలి. పాశ్చాత్యదేశములో నరావతారముగా వచ్చిన భగవంతుడు, జనులపై దయ చూపినాడు, చివరికి తనను చంపిన వారిపై కూడా దయ చూపినాడు. ఎందుకంటే, ఇలాంటి దయ వారిలో క్రూర మనస్తత్వము నుండి మంచి మార్పును తేగలిగితే వారి వెనకటి పాపాలు కూడా రద్దు చేయవచ్చును. ఈ ప్రయోజనమును వారికి ఇవ్వదలచి నరావతారుడు తన చివరిప్రార్థనలో ఆ పాపులను రక్షింపమని భగవంతుని (ఎందుకంటే ఆ పాపులు నరావతారమును భగవంతుడుగా విశ్వసించలేదు) ప్రార్థించాడు. ఈ చివరి సంఘటన తర్వాత అయినా ఆ పాపులలో సత్ప్రవర్తన వస్తే, వారు తప్పక రక్షింపబడతారు. కాని వారు మంచిగా మారకపోతే నరకంలో మండుతున్న అగ్నిలోకి విసిరివేయబడతారు. ఈవిధముగా ఈ 'దివ్యవిధానము' మరియు 'పాపులపై కూడా భగవంతుడు దయ చూపుట' మధ్య సమన్వయము కుదురుతుంది. ఇంత జరిగినా ఒకవేళ పాపులలో సత్ప్రవర్తన రాకపోతే భగవంతుడు నిర్ణయించిన దివ్యశాసనము ప్రకారముగా నిత్య నరకాగ్నిలో విసరివేయబడుట తప్పక నెరవేర్చబడును.]

ప్రవృత్తావపి సహసా, ధనార్థీ పాప దుఃఖవాన్ |
అశాంతో న స్థిరాం బుద్ధిం, నివృత్తౌ కురుతే నరః ||9.19||

[అహంకారము వలన పుట్టిన అసూయ అనే గుణము, పాపములు చేయడానికి ప్రేరేపించే ముఖ్య కారణము. ఒకవేళ మన పొరుగు వారు బాగా ధనవంతులైతే, మన కడుపుల్లో మంట బయలుదేరి, కాలక్రమములో ఆ మంట అల్సరుగా స్థిరపడుతుంది. ఈ కడుపుమంటను చల్లార్చుకోవడానికి, తక్కువ సమయంలో ఎక్కువ ధనము సంపాదించాలని ఆరంభించి, సాధారణ ప్రవృత్తి జీవితంలో ఎన్నో పాపకర్మలు చేస్తుంటాము. పాపములకు విధింపబడిన శిక్షల రూపంలో దుఃఖము మరియు మనోవ్యాకులత కలుగుతాయి. ఇవి మన నివృత్తి జీవితంలో ప్రశాంతమైన ఏకాగ్రచిత్తములో అలజడి కలిగిస్తాయి.]

నివృత్తౌ చ స్ఖలత్యేష, తత్రాత్ర దైవ దూరవాన్ |
అహంతా మత్సరీ నష్టః, సర్వత్రేతి విలోక్యతామ్ ||9.20||

[నివృత్తి జీవితములో కూడా ఈ అహంకారపూరిత అసూయ వలన భక్తుడు బాధపడును. విశిష్టమైన ఆధ్యాత్మిక జ్ఞానమును బోధించి, భూమి మీద భక్తులను ఉద్ధరించడానికి, నరమాధ్యమములో సాక్షాత్తు వచ్చిన దత్త భగవానుని, దత్తావతారుడు అని గుర్తించడములో అట్టి భక్త జీవుడు విఫలమగును. ఇదే అహంకారపూరిత అసూయ వలన భక్తుడు, తన మరణము తర్వాత ఊర్ధ్వ లోకాలలో తేజోరూప శరీరమును ధరించినపుడు, తేజోరూపాత్మకుడైన దత్తావతారమును గుర్తించుటలో కూడా విఫలమగును. ఈ విధముగా జీవాత్మ ప్రవృత్తిలోనూ, నివృత్తిలోనూ విఫలమగుటయే కాదు, అవతారపురుషుడై వచ్చిన పరమాత్మను పొందుటలో ఇక్కడ (భూమి మీద ఆయుష్యము ఉన్నపుడు), అక్కడ (మరణానంతరము ఊర్ధ్వలోకాలలో ఉన్నపుడు) విఫలమగును. మొత్తానికి మొత్తం నష్టపోతాడు. శ్రద్ధ, సహనంతో

ప్రతి ఒక్కరూ (జీవితము ఉన్నపుడే) ఈ అంశాలను లోతుగా గమనించాలి.]

ఇతి త్రైలోక్యగీతాయాం 'గుణవిచారయోగో' నామ నవమాధ్యాయః ||

ఈ విధంగా త్రైలోక్యగీత యందు 'గుణ విచార యోగము' అను నవమాధ్యాయము పూర్తి అయినది.